
సాక్షి గుంటూరు

సోమవారం । 7 । జూలై । 2025



కనకదుర్గమ్మకు బోనాలు

పిడుగురాళ్ల: పట్టణంలోని వాసవీనగర్‌లో ఉన్న కనకదుర్గ అమ్మ వారికి భక్తులు ఆదివారం బోనాలు సమర్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 526.40 అడుగుల వద్ద ఉంది. ఎడమ కాలువకు 3,202 క్యూసెక్కులు విడుదలవుతోంది.

గాజుల అలంకరణలో మహంకాళి అమ్మవారు



దుగ్గిరాల: మండలంలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో ఉన్న మహంకాళి ఆలయంలో అమ్మ వారికి ఆదివారం గాజుల అలంకరణ చేశారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

న్యూస్‌రీల్

ప్రణాళికాబద్ధంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరించండి



పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరంలో శంకర్ విలాస్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ సిబ్బందికి సూచించారు. ఓవర్ బ్రిడ్జి పనుల నేపథ్యంలో చేపట్టిన ట్రాఫిక్ మళ్లింపును ఎస్పీ ఆదివారం స్వయంగా పరిశీలించారు. శంకర్‌విలాస్ బ్రిడ్జి వద్ద (బ్రాడీపేట వైపు), కంకర గుంట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద, మూడు వంతెనల మార్గం వద్ద, కొత్తపేట శివాలయం వద్ద చేపట్టిన ట్రాఫిక్ మళ్లింపు చర్యలను పరిశీలించి ట్రాఫిక్ అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో కంకరగుంట రైల్వే అండర్ బ్రిడ్జి, మూడు వంతెనల మార్గం వద్ద నీరు ఎక్కువగా చేరడం వలన వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని ట్రాఫిక్ అధికారులు ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్, వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ అరవింద్, ట్రాఫిక్ ఈస్ట్, వెస్ట్ సీఐలు ఏ.అశోక్, సింగయ్య, ఎస్బీ సీఐ అళహరి శ్రీనివాస్, నగరంపాలెం సీఐ నజీర్‌బేగ్, అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజు, ట్రాఫిక్ ఎస్సైలు రవీంద్రబాబు, సాంబశివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం



ప్రత్తిపాడు: రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపిన ప్రకారం... వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడుకు చెందిన ఓ రైస్ మిల్లులో అక్రమంగా రేషన్ బియ్యం పెద్ద ఎత్తున నిల్వ చేశారన్న సమాచారం జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు అందింది. ఎస్పీ ఆదేశాల మేరకు గుంటూరు సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీ జి. భానూదయ, సీఐ రమానాయక్, సిబ్బందితో కలిసి మిల్లులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా మిల్లులో రేషన్ బియ్యం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. సమాచారాన్ని రెవెన్యూ, సివిల్ సప్లైస్ అధికారులకు తెలియజేశారు. వట్టిచెరుకూరు తహసీల్దార్ క్షమారాణి, సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌లు మిల్లు వద్దకు చేరుకున్నారు. బస్తాల్లో నిల్వ చేసిన సుమారు 60 టన్నులకు పైగా రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

పటాలంలో తొలి ఏకాదశి పూజలు



మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి సంస్థ పరిధిలోని ఆరవ బెటాలియన్‌లో ఆదివారం ఆషాఢ తొలి ఏకాదశి సందర్భంగా మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. బెటాలియన్ కమాండెంట్ మాట్లాడుతూ భక్తులు అమ్మవారికి సారె చీరెలు సమర్పించడం ఆనవాయితీ అని, అమ్మవారి దయతో కుటుంబాలు సంతోషంగా ఉంటాయని నమ్మకం అని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాడెంట్ ఆశీర్వాదం, అధికారులు, స్థానిక మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం శివాలయం వీధికి చెందిన మహిళలు ఆదివారం విజయవాడ కనక దుర్గమ్మ వారికి ఆషాఢ సారె సమర్పించారు. శ్రీ సోమేశ్వర స్వామి వారి దేవాలయంలోని పార్వతీ దేవికి తొలుత సారె సమర్పించి, మేళ తాళాలతో కాలినడకన విజయవాడ దుర్గమ్మ వారికి సారె తీసుకెళ్లారు. స్థానిక మహిళలు అమ్మాజి, అనూష, సరళ, స్రవంతి, కౌసల్య, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దూర విద్య.. పరీక్షలు మిథ్య

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో దూర విద్య పరీక్షలు ప్రహసనంగా మారాయి. కాసులివ్వు.. కాపీ కొట్టుకో.. అన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. అండర్ గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్‌తోపాటు ఇతర కోర్సుల పరీక్షలు ఈ నెల 10వ తేదీ నుంచి జరగనున్నాయి. మూడు విడతలుగా ఆగస్టు 7వ తేదీ వరకు కొనసాగనున్నాయి. రాష్ట్రంలోని 115 పరీక్ష కేంద్రాలలో 72 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

- అందినకాడికి దండుకునే యత్నాలు
- ఏఎన్‌యూలో అధికారుల కాసుల కక్కుర్తి
- విధుల కేటాయింపునకూ ప్రత్యేక రేటు
- కూటమి ప్రభుత్వంలో యథేచ్ఛగా అక్రమాలు

పరీక్ష కేంద్రాల నిర్వాహకుల నుంచి అడ్డగోలుగా వసూళ్లు



ఆచార్య నాగార్జున యూనివర్సిటీ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత గత ఏడాది జరిగిన దూర విద్య పరీక్షల్లో రూ. కోట్ల విద్యా వ్యాపారం జరగడమే కాకుండా... రాష్ట్రవ్యాప్తంగా అనేక వివాదాలకు ఈ పరీక్షలు కేంద్ర బిందువుగా మారాయి. అనేక సెంటర్‌లలో బహిరంగ కాపీయింగ్ వెలుగు చూడటం.. తనిఖీ బృందాల అక్రమాలపై కూడా వార్తలు వచ్చాయి. గత ఏడాది అన్ని ఆరోపణలు వచ్చినా విచారణ చేయడంగానీ, చర్యలు తీసుకోకపోవడంతో ఈసారి మరింత బరి తెగించారు.

వసూళ్లపై ఆడియో సందేశం

"ఫ్రెండ్స్, నాగార్జున యూనివర్సిటీకి సంబంధించి ఎగ్జామ్ సెంటర్స్‌కు సంబంధించి విల్లింగ్ లెటర్స్ కో–ఆర్డినేటర్‌తో పాటు డైరెక్టర్ గారికి కూడా ఒకటి ఇవ్వాలి. దాని ప్రకారం ప్రతి ఒక్కరూ కూడా ఒకటి కో–ఆర్డినేటర్‌కి మరొకటి డైరెక్టర్ గారికి ఇవ్వండి. ఇప్పటి వరకూ కో–ఆర్డినేటర్‌కి మాత్రమే ఇచ్చిన వారు డైరెక్టర్‌కి కూడా ఇచ్చి, ఆయన్ని కలవాలి. అర్థం అయ్యింది కదా? కలవడమంటే తెలుసు కదా? అన్ని కూడా 50–50 చేయాలి. లెటర్ 50–50 చేయాలి. మిగిలిన విషయాలు కూడా 50–50 మాట్లాడుకోవాల్సిన అవసరం ఏర్పడింది. దయచేసి అందరూ దీన్ని అర్థం చేసుకుని ముందుకు వెళ్లాలి."... ఇదీ నాగార్జున యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య పరీక్ష కేంద్రాల నిర్వాహకుల గ్రూపులో పెట్టిన ఆడియో సారాంశం. అంటే వసూళ్లు ఏ స్థాయిలో ఎంత యథేచ్ఛగా సాగుతున్నాయో దీన్ని బట్టి అర్థమవుతోంది.

ఆ ముగ్గురే కీలక సూత్రధారులు

కాసులు కురిపించే సెంటర్ల ఎంపికకు, కాపీ చేసుకునే అవకాశం కల్పించడం కోసం మూడు కవర్లు సమర్పించుకోవాల్సి ఉంటుంది. వివిధ సెంటర్స్ నుంచి విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఒక కవర్‌ను వర్సిటీలో సామాజిక అంశాలను బోధించే ఒక అయ్యవారికి.. ఆర్గానిక్ సమీకరణాలతో అందినంత దండుకునే మరో ఆచార్యునికి రెండో కవర్‌ను.. గతంలో అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయిన మరో నాన్ టీచింగ్ ఉద్యోగికి మూడో కవర్‌ను అందిస్తేనే సెంటర్స్‌ను కేటాయిస్తున్నారు. వర్సిటీలో కీలక వ్యక్తులుగా హల్‌చల్ చేస్తూ ఇద్దరు ఆచార్యులు ఈ వ్యవహారంలో కలెక్షన్ కింగ్‌లుగా మారారు. గతంలో పలు మార్లు సస్పెండ్ కావడమే కాకుండా.. నోట్‌ఫైల్ వ్యవహారంలో పోలీసు స్టేషన్‌లో విచారణ ఎదుర్కొన్న మరో కింది స్థాయి ఉద్యోగి ఇక్కడ మరో కీలక సూత్రధారి. చిన్న సెంటర్స్ కేటాయింపునకు కూడా రూ. వేలు సమర్పించుకోవాల్సి వస్తోంది.

విధుల కేటాయింపునకూ అదే తంతు..

గత ఏడాది పరీక్షల్లో రాయలసీమలో తనిఖీ బృందాల వసూళ్లు రాష్ట్రవ్యాప్తంగా సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీశాయి. లక్షలాది రూపాయలు డిమాండ్ చేసిన ఒక పరిశీలకుడికి సినీ ఫక్కీలో దేహశుద్ధి జరిగింది. ఈ అక్రమాల వెనుక గెస్ట్ లెక్చరర్ కీలకంగా వ్యవహరించినట్లు ఫిర్యాదులు వెళ్లాయి. సదరు అధ్యాపకుడు ఒక కీలక అధికారికి స్కాలర్ కావడంతో తిరిగి ఈ విద్యా సంవత్సరం కూడా పరిశీలకుల నియామకంలో పైరవీలకు తెరతీశారు. పరిశీలకుల విధులు కేటాయిస్తానంటూ అనుబంధ కళాశాలల అధ్యాపకుల నుంచి రూ. 20 వేల చొప్పున తీసుకున్నారు.

కాసుల కోసం వరుసలో ఆచార్యులు

కాసుల వర్షం కురుస్తుండటంతో వర్సిటీ దూర విద్యా పరీక్షల విధుల కోసం శాశ్వత ఆచార్యులు కూడా పోటీ పడుతున్నారు. రీజనల్ కో ఆర్డినేటర్లు, తనిఖీ బృందాలను కలిసేందుకు పోటీ పెరిగిపోయింది. కొందరు కూటమి ప్రజా ప్రతినిధులు కూడా తమ అనుచరులకు రూ.లక్షలు కేటాయించే సెంటర్స్ ఇవ్వాలని ఒత్తిడి ప్రారంభించారు. దీంతో పరీక్షలు ప్రహసనంగా మారుతున్నాయి.

భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి



గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు

- ఆలయాల్లో విశేష పూజలు
- గరుడ వాహనంపై దర్శనమిచ్చిన నృసింహస్వామి
- కిటకిటలాడిన దేవాలయాలు

మంగళగిరి/ మంగళగిరి టౌన్: తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా భక్తిపారవశ్యం పరవళ్లు తొక్కింది. ఆలయాలన్నీ భక్తజనంతో కిక్కిరిశాయి. భక్తులు గంటలు తరబడి క్యూలైన్‌లో నిలబడి స్వామి వారిని దర్శించుకున్నారు. మంగళగిరి నగర పరిధిలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించేందుకు భక్తులు పోటెత్తారు. పూజారులు ముందుగా స్వామివారికి అభిషేకం చేశారు. భక్తులు ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం రాజ్యలక్ష్మీ అమ్మ వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని గరుడ వాహనంపై ఊరేగించారు. స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి గరుడ వాహనంపై వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో వేడుకలో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ అడిషనల్ కమిషనర్ సునీల్ కుమార్ పర్యవేక్షించారు.



స్వామి వారిని దర్శించుకునేందుకు వేచి చూస్తున్న భక్తులు

హత్యాయత్నంలో ఎమ్మెల్యేపై అనుమానాలు



ఎస్పీ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాగ మల్లేశ్వరరావు సోదరుడు అమరేంద్ర, మోదుగుల వేణుగోపాల రెడ్డి, అంబటి మురళీకృష్ణ, అన్నాబత్తుని శివకుమార్, వనమా బాల వజ్రబాబు

- వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై కేసుల నమోదులో పోలీసుల దూకుడు
- కూటమి నేతలపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలో మాత్రం నిర్లక్ష్యం
- దాడి సూత్రధారి అయిన ఎమ్మెల్యే ధూళిపాళ్లపై కేసు నమోదు చేయాలి
- గుంటూరు జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందించిన వైఎస్సార్‌సీపీ నాయకులు
- ఎమ్మెల్యే పేరు ఎఫ్‌ఐఆర్‌లో చేర్చే వరకు ఎంతవరకైనా పోరాడతామని స్పష్టీకరణ

నగరంపాలెం: పొన్నూరు మండలం మన్నవ గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత బొనిగల నాగ మల్లేశ్వరరావుపై పాశవికంగా జరిగిన హత్యాయత్నంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పాత్రపై అనుమానం ఉందని వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి ఆరోపించారు. నాగ మల్లేశ్వరరావు కేసు పూర్వపరాలను ఆదివారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ దృష్టికి మోదుగులతోపాటు మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, నియోజకవర్గాల సమన్వయకర్తలు అంబటి మురళీకృష్ణ, వనమా బాల వజ్రబాబు, బాధితుని సోదరుడు అమరేంద్ర, కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ ఈ హత్యాయత్నం జరిగి నాలుగు రోజులైనా పోలీసుల దర్యాప్తు నత్తనడకగా సాగుతోందని ఆరోపించారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా ముగ్గుర్ని అరెస్ట్ చేశారని, పాత్రధారుల కంటే సూత్రధారులు ముఖ్యమని అన్నారు. జంట హత్య కేసుల్లో సీసీ టీవీ ఫుటేజీలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఉన్నారా? పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఉన్నారా? అని ప్రశ్నించారు. ఆ రూల్‌ను ఇక్కడ స్థానిక శాసనసభ్యునికి వర్తింపజేయరా అని అన్నారు. రైతులను పరామర్శించేందుకు మిర్చి యార్డుకు వెళ్తే మాజీ సీఎం వైఎస్ జగన్, ఇతర నేతలపై కేసులు నమోదు చేశారని ఆరోపించారు. రెడ్‌బుక్ ప్రకారమే పోలీసులు నడుస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ సీటులో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ స్థానంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల కూర్చుంటే సరిపోతుందని మండిపడ్డారు. ధూళిపాళ్ల నరేంద్ర సూచనల్లేకుండా బాబురావు కుటుంబం ఈ హత్యాయత్నం చేయదని ఆరోపించారు. హత్యాయత్నం బాధ్యులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే ధూళిపాళ్లపై కేసు నమోదు చేయాల్సిందే

\- అంబటి మురళీకృష్ణ

పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ తీవ్ర గాయాలతో నాగ మల్లేశ్వరరావు ప్రాణాలతో పోరాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి, నిందితులను అరెస్ట్ చేశారని అన్నారు. అలాగే టీడీపీ మినీ మహానాడులో ఎమ్మెల్యే ధూళిపాళ్ల చేసిన వ్యాఖ్యలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు జరిగిన పలు హత్యలకు ఎమ్మెల్యే కారకుడని ఆరోపించారు. ఆయన పేరును ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయకపోతే సుప్రీంకోర్టు వరకైనా వెళ్తామని స్పష్టం చేశారు. విలేకర్ల సమావేశంలో పొన్నూరు నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, పెదకాకాని మండల పార్టీ అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి ఉయ్యూరు సతీష్‌రెడ్డి, నియోజకవర్గ గ్రీవెన్స్ అధ్యక్షుడు దయానంద్, పెదకాకాని మండలం సీనియర్ నాయకులు మందాల శివారెడ్డి, తక్కెళ్లపాడు సొసైటీ మాజీ అధ్యక్షుడు సుబ్బారావు, ఉప్పలపాడు ఎంపీటీసీ దంతాల శ్రీనివాసరావు, చేబ్రోలు మండలం బూత్ కమిటీ అధ్యక్షుడు కొల్లి శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ ప్రవేశాలకు వేళాయె..

- నేటి నుంచి ఏపీఈఏపీసెట్–2025 కౌన్సెలింగ్
- ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్‌కు ఏర్పాట్లు
- షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర సాంకేతిక విద్య, ఉన్నత విద్యా మండలి
- 17 వరకు హెల్ప్‌లైన్ కేంద్రాల వారీగా ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల పరిశీలన
- 13 నుంచి 18వ తేదీ వరకు కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్లు



ఏపీ ఈఏపీసెట్‌కు హాజరైన విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ ఈఏపీసెట్–2025) కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం ప్రారంభం కానుంది. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్య, ఉన్నత విద్యామండలి షెడ్యూల్ విడుదల చేశాయి. మే నెలలో జరిగిన ఏపీ ఈఏపీసెట్–2025 (ఎంపీసీ స్ట్రీమ్)లో అర్హత సాధించి, ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఎదురు చూస్తున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఏ ధ్రువపత్రాలు అవసరమంటే..

ఏపీఈఏపీసెట్–2025 వెబ్ బేస్డ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనే విద్యార్థులు సిద్ధం చేసుకోవాల్సిన ధ్రువపత్రాల జాబితాను నోటిఫికేషన్‌లో పొందుపర్చారు. ఏపీఈఏపీసెట్–2025 ర్యాంక్ కార్డ్, హాల్ టిక్కెట్, ఇంటర్ మార్కుల జాబితా, జనన ధ్రువీకరణ పత్రం /టెన్త్ సర్టిఫికెట్, టీసీ, 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్, 2025–26 సంవత్సరపు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ప్రైవేటు విద్యార్థులకు రెసిడెన్స్ సర్టిఫికెట్, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సామాజిక వర్గ ధ్రువీకరణ పత్రాలు, శారీరక వైకల్యం గల విద్యార్థులకు సంబంధిత ధ్రువీకరణ పత్రం అవసరం అని పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపుతో మొదలు

ఏపీఈఏపీసెట్–2025లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు సోమవారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు సెట్స్.ఏపీఎస్‌సీహెచ్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి, రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందు కోసం ఏపీఈఏపీసెట్ హాల్ టిక్కెట్, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేసి లాగిన్ కావాలి.

- రిజిస్ట్రేషన్ సమయంలో ఓసీ, బీసీ విద్యార్థులు రూ.1,200, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.600 చొప్పున ప్రాసెసింగ్ ఫీజును ఇదే వెబ్‌సైట్‌లో క్రెడిట్ కార్డు, డెబిట్‌కార్డు, నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించాలి. ఏపీఈఏపీసెట్ డీటైల్డ్ నోటిఫికేషన్, యూజర్ మాన్యువల్, కళాశాలల జాబితా, విద్యార్థులకు మార్గదర్శకాలను ఇదే సైట్‌లో పొందుపర్చారు.

దరఖాస్తు సమయంలోనే సర్టిఫికెట్ల పరిశీలన

ఏపీఈఏపీసెట్–2025లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలన కోసం హెల్ప్ లైన్ కేంద్రాలకు విధిగా వెళ్లాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఈఏపీసెట్‌కు దరఖాస్తు చేసే సమయంలోనే విద్యార్థులు సమర్పించిన టెన్త్, ఇంటర్ మార్కుల జాబితాలు, సామాజికవర్గ, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను వెబ్ బేస్డ్ విధానంలో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ పూర్తి చేసింది. ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి, రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు కంప్యూటర్ స్క్రీన్‌పై ప్రత్యక్షమయ్యే 'రిజిస్ట్రేషన్ వివరాలు తెలుసుకోండి' అనే చోట క్లిక్ చేయాలి. తద్వారా విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ఏ స్థాయిలో ఉన్నది తెలుసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల పరిశీలన ఇప్పటికే పూర్తయిన విద్యార్థులకు కంప్యూటర్ స్క్రీన్‌పై కేండెట్ ఈజ్ ఎలిజిబుల్ ఫర్ ఎక్సర్‌సైజింగ్ ఆప్షన్స్ అని కనిపిస్తే, విద్యార్థులు వెబ్ ఆప్షన్ల నమోదుకు సిద్ధం కావచ్చు. ఈ విధంగా కాకుండా ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ హెల్ప్‌లైన్ కేంద్రంలో పురోగతిలో ఉన్న పక్షంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈజ్ అండర్ ప్రోగ్రెస్ అని కనిపిస్తుంది.

సమీప కేంద్రం ఎంపిక ఇలా..

ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ధ్రువపత్రాలు అసంపూర్తిగా ఉండటం, వివరాలు అసమగ్రంగా ఉన్న పరిస్థితుల్లో కాంటాక్ట్ హెల్ప్‌లైన్ సెంటర్ (హెచ్‌ఎల్‌సీ) అని డిస్‌ప్లే అవుతుంది. ఈ విధంగా డిస్‌ప్లే అయితే ఆన్‌లైన్‌లో పొందుపర్చిన హెల్ప్‌లైన్ కేంద్రాల జాబితా నుంచి తమకు సమీపంలోని కేంద్రాన్ని ఎంపిక చేసుకోవాలి. అనంతరం విద్యార్థులకు సంబంధించి అసమగ్రంగా ఉన్న సర్టిఫికెట్ల వివరాలు ప్రత్యక్షమవుతాయి. సంబంధిత సర్టిఫికెట్లను విద్యార్థులు తిరిగి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తరువాత హెచ్‌సీఎల్‌లో అధికారులు వాటిని పరిశీలించి, అన్నీ సక్రమంగా ఉంటే ఆమోదిస్తారు. దీంతో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తవుతుంది. అనంతరం వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు.



వెబ్ కౌన్సెలింగ్‌లో విద్యార్థులు (ఫైల్)

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు: **02**, సీట్లు: **780**

ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు: **34**, సీట్లు: **29,460**

ఏపీఈఏపీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల సంఖ్య: **23,536**

హెల్ప్‌లైన్ కేంద్రాలు ఇక్కడున్నాయి..

గుంటూరు శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంతో పాటు నరసరావుపేటలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు సమయంలో విద్యార్థులు అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లను ఆయా హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ఈ నెల 7వ తేదీ నుంచి 17వ వరకు పరిశీలిస్తారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన విద్యార్థులు ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొని కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. వెబ్ ఆప్షన్లు మార్చుకునేందుకు ఈ నెల 19న తుది అవకాశం ఉండగా, ఈ నెల 22న సీట్ల కేటాయింపు జరుపుతారు. ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు కళాశాలల్లో చేరికలు, ఆగస్టు 4వ తేదీ నుంచి బీటెక్ ప్రథమ సంవత్సర తరగతులు ప్రారంభం కానున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని 36 ఇంజినీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో 30,240 సీట్లు ఉన్నాయి. వీటిలో రెండు ప్రభుత్వ కళాశాలల్లో 780 సీట్లు, 34 ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో 29,460 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కాగా ఈఏపీసెట్ ఇంజినీరింగ్ పరీక్షలో 23,536 మంది విద్యార్థులు అర్హత సాధించారు. వీరిలో జేఈఈ అడ్వాన్స్, మెయిన్స్ వంటి పరీక్షల ద్వారా జాతీయస్థాయి విద్యా సంస్థల్లో చేరిన వారు కూడా ఉన్నారు.

క్లుప్తంగా

ఏపీ గ్రామీణ బ్యాంక్ గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ ప్రెసిడెంట్‌గా వాసుబాబు



సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ రాష్ట్ర ప్రెసిడెంట్‌గా పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన శిరసాల వాసుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతపురంలో ఆదివారం నిర్వహించిన గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. వాసుబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో గోల్డ్ అప్రైజర్ల సమస్యలు పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో తనను రాష్ట్ర ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు యూనియన్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వాసుబాబు నియామకంపై పలువురు హర్షం వెలిబుచ్చారు. ఆయనను సత్కరించారు.

అప్రైజర్ కుటుంబానికి ఆర్థిక సాయం

ఏపీ గ్రామీణ బ్యాంక్ తిరుపతి బ్రాంచ్‌లో గోల్డ్ అప్రైజర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ మస్తాన్ కిడ్నీ ఫెయిల్ అయి అనారోగ్యంతో చెన్నై వైద్యశాలలో చికిత్స పొందుతుండటంతో ఏపీ గ్రామీణ బ్యాంక్ గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ నుంచి రూ.1.05 లక్షలు నగదు ఆదివారం ఆర్థిక సాయంగా అందించారు. మస్తాన్ భార్య జాన్‌బీకి నగదును అందించినట్లు యూనియన్ రాష్ట్ర ప్రెసిడెంట్ శిరసాల వాసుబాబు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ బాధ్యులు, తదితరులు ఉన్నారు.

శిలాఫలకం ధ్వంసం చేసిన టీడీపీ నాయకులు



నరసరావుపేటటౌన్: రొంపిచర్ల మండలం వీరవట్నం గ్రామంలో సాగు నీటి సంఘం కార్యాలయ శిలాఫలకాన్ని టీడీపీ గ్రామ నాయకులు శనివారం ధ్వంసం చేశారు. గత తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో అప్పటి మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు భవన నిర్మాణానికి సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దీన్ని గ్రామ టీడీపీలోని వ్యతిరేక వర్గం ధ్వంసం చేసింది. దీంతో టీడీపీలో ఉన్న అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. ధ్వంసం చేసిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని వీరవట్నం గ్రామ నీటి సంఘం మాజీ అధ్యక్షుడు వెలగమూరి వెంకటనారాయణ రొంపిచర్ల పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు.

దేశం గర్వించదగ్గ నేత బాబూ జగ్జీవన్‌రాం

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు
- పార్టీ జిల్లా కార్యాలయంలో ఘన నివాళి



జగ్జీవన్‌రాం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మోదుగుల వేణుగోపాల రెడ్డి, అంబటి మురళీకృష్ణ, వనమా బాల వజ్రబాబు తదితరులు

పట్నంబజారు: దేశం గర్వించదగ్గ మహోన్నతుడు భారతరత్న బాబూ జగ్జీవన్‌రాం అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి కొనియాడారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జగ్జీవన్‌రాం వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ బిహార్‌లో జన్మించిన బాబు జగ్జీవన్‌రాం యావత్ దేశానికి సేవలు అందించారన్నారు. దేశంలో కరువు సమయంలో ఆహార శాఖ మంత్రిగా సవాళ్లను అధిగమించి పరిపాలన అందించిన గొప్ప పరిపాలనాదక్షుడని కొనియాడారు. రక్షణ శాఖ మంత్రి సైతం ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని చెప్పారు. ఆయన కారులో ప్రయాణం చేసే అదృష్టం తనకు దక్కిందన్నారు. నేటితరం ప్రజాప్రతినిధులు ఆయన్ను ఆదర్శంగా తీసుకొని ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. పేదల పక్షాన పోరాడిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రాం కృషి ఎనలేనిదని తెలిపారు. వారి ఆశయాలను వైఎస్సార్ సీపీ ముందుకు తీసుకెళ్తుందన్నారు.

జగ్జీవన్‌రాం స్ఫూర్తితో ముందుకు సాగుతాం..

పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ జగ్జీవన్‌రాం వంటి మహనీయులను చూసి గర్వపడాలో, కూటమి ప్రభుత్వంలో హత్యలకు గురవుతున్న దళిత నేతలను చూసి బాధపడాలో అర్థంకాని పరిస్థితి నెలకొందన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో జగ్జీవన్‌రాం స్ఫూర్తితో ఎదిగిన నాగ మల్లేశ్వరరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర మట్టుబెట్టాలని చూశారని ఆరోపించారు. బలహీన వర్గాలు పైకి రాకూడదని, దళిత వ్యతిరేకిగా ధూళిపాళ్ల నరేంద్ర పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్ని హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులు చేసినా జగ్జీవన్‌రాం వంటి మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు ముందుకు సాగుతారని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను వైఎస్సార్ సీపీ మాత్రమే చిత్తశుద్ధితో బడుగు బలహీన వర్గాలకు అందిస్తుందని పేర్కొన్నారు. తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) కూడా ప్రసంగించారు. నేతలు నిమ్మకాయల రాజనారాయణ, మండేపూడి పురుషోత్తం, నందేటి రాజేష్, తాడిబోయిన వేణుగోపాల్, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, పఠాన్ సైదాఖాన్, పిల్లి మేరీ, ప్రభు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నేతలు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ లేని బడి నేడు అవసరం

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న నక్కా వెంకటేశ్వర్లు

తెనాలి: నేటి కాలంలో పిల్లల విద్యాభివృద్ధికి సెల్‌ఫోన్ అత్యంత అవాంతరంగా మారిందని, పాఠశాలలో సెల్‌ఫోన్‌తో పని లేని విధానం ఉండాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. యూటీఎఫ్ గుంటూరు జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రావు అధ్యక్షతన ఆదివారం తెనాలి ప్రాంతీయ కార్యాలయంలో జరిగింది. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ ప్రభావంతో పిల్లలు పాడైపోతున్నారని, ఉపాధ్యాయుల బోధనపై కూడా సెల్ ప్రభావం పడుతోందని అన్నారు. రోజువారీ రకరకాల సమాచారం అప్‌లోడ్, డౌన్లోడ్‌తో, ఆన్‌లైన్ శిక్షణలతో బోధన సమయం హరించుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు కూడా సెల్ ఫోన్ వాడకం నియంత్రణలో ఉంచుకోవాలని ఆయన సూచించారు. టెక్నాలజీని అవసరం మేరకు మాత్రమే వినియోగించుకోవాలని, అతిగా ఆధారపడి, దానికి బానిసగా మారితే కర్తవ్యం మరుగునపడి వ్యవస్థ పతనం అవుతుందని అన్నారు. బోధన సమయాన్ని పిల్లలకు మాత్రమే కేటాయించాలని, పాఠశాల రోజువారీ పనిని మెరుగుపరచాల్సిన అవసరం ఉపాధ్యాయులపై, అధికారులపై ఉందన్నారు. అవసరమైతే అదనంగా ఒక గంట పాఠశాలలో సమయాన్ని గడిపి విద్యార్థులకు మార్గదర్శనం చేయాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ హనుమంతరావు మాట్లాడుతూ పీటీఎంలో విట్నెస్ అధికారిని నియమించాలనే ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ టీఎస్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ 12వ పీఆర్సీ చైర్మన్‌ను తక్షణం నియమించాలని, ఆర్థిక బకాయిలు చెల్లించాలని కోరారు. యూటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్, ఎం.కళాధర్‌లు మాట్లాడుతూ బదిలీలు, ప్రమోషన్లు తర్వాత ఉపాధ్యాయులకు డీడీఓ కోడ్స్, పొజిషన్ ఐడీలో తక్షణం కేటాయించి జీతాలు ఈ నెలలోనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా సహాధ్యక్షులు ఎ.వెంకటేశ్వర్లు, కోశాధికారి దౌలా, జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

డాక్టర్ జయపాలరెడ్డికి అరుదైన గౌరవం



డాక్టర్ జయపాలరెడ్డి

గుంటూరు మెడికల్: ది అమెరికన్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ఫెలోగా మంగళగిరి ఎన్నారై మెడికల్ కాలేజ్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ జయపాలరెడ్డి వెలగల ఎంపికయ్యారు. ప్రపంచ వైద్య రంగంలో ముఖ్యంగా సర్జికల్ విభాగంలో ప్రతిష్టాత్మకమైన ఫెలో ఆఫ్ ది అమెరికన్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ అనే బిరుదు ఆయనకు లభించింది. ఈ విషయాన్ని ఏసీఎస్ డైరెక్టర్ మైఖేల్ ఇ-మెయిల్ ద్వారా డాక్టర్ జయపాలరెడ్డికి తెలిపారు. చికాగోలో అక్టోబర్ 4 నుంచి 7వ తేదీ వరకు క్లీనికల్ కాంగ్రెస్ సమావేశం జరగనుంది. 10 వేల మందికిపైగా హాజరుకానున్నారు. ఆ కార్యక్రమంలో డాక్టర్ జయపాలరెడ్డి ఈ గౌరవాన్ని స్వీకరించనున్నారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరు గ్రామానికి చెందిన ఆయన విశాఖపట్నంలో 2004లో ఎంబీబీఎస్ చదివారు. పాండిచ్చేరి జిప్‌మర్‌లో 2012లో జనరల్ సర్జరీలో పీజీ చేశారు. కేరళ కొచ్చిలోని అమృత ఇనిస్టిట్యూట్‌లో సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ, జపాన్‌లో ఫెలోషిప్ చేశారు. కొచ్చిలో ఐదేళ్లపాటు, ముంబయి కోకిలా బెన్ హాస్పిటల్‌లో ఏడాదిపాటు పనిచేశారు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, పెద్దపేగు క్యాన్సర్, చిన్నపేగు క్యాన్సర్, ప్యాంక్రియాస్ సర్జరీలు, రోబోటిక్ సర్జరీలు చేశారు. ఎన్నారై మెడికల్ కాలేజ్‌లో 2021 నవంబర్ నుంచి సంబంధిత వైద్య విభాగాధిపతిగా పనిచేస్తున్నారు. 1500కుపైగా ఆపరేషన్లు విజయవంతంగా చేశారు. ఈ గుర్తింపు రావటం చాలా సంతోషంగా ఉందని డాక్టర్ జయపాలరెడ్డి తెలిపారు. వైద్య కళాశాల, హాస్పిటల్ యాజమాన్యం, సర్జన్లు ఆయన్ను అభినందించారు.

మహిళ పొట్ట నుంచి నాలుగు పెన్నులు వెలికితీత

నరసరావుపేట: ఓ మహిళ పొట్ట నుంచి నాలుగు బాల్‌పెన్నులు డాక్టర్లు బయటకు తీసిన సంఘటన పట్టణంలోని మాతాశ్రీ హాస్పిటల్‌లో శనివారం చోటుచేసుకుంది. వినుకొండ రోడ్డులోని మాతాశ్రీ హాస్పిటల్ అధినేత డాక్టర్ పి.రామచంద్రారెడ్డి ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఓ మహిళ వాంతులతో బాధపడుతుండగా ఆమె కుటుంబ సభ్యులు హాస్పిటల్‌లో సంప్రదించారు. ఎండోస్కోపీ ద్వారా పరీక్షలు నిర్వహించగా ప్రేగులో పెన్నులు ఉన్నట్లు గుర్తించామన్నారు.

హక్కుల కోసం పోరాటానికి సిద్ధంకండి

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రాజ్యాధికారమే లక్ష్యం
- మాజీ డీజీపీ, ఏఐబీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త జె.పూర్ణచంద్రరావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డీజీపీ జె. పూర్ణ చంద్రరావు

నెహ్రూనగర్: హక్కుల కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లందరూ ఏకమై పోరాడేందుకు రాష్ట్రస్థాయిలో బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ డీజీపీ, ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ (ఏఐబీఎస్పీ) రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ జె. పూర్ణచంద్రరావు అన్నారు. ఆదివారం గుంటూరులోని శ్రీనగర్‌లో మండల్ స్టడీ సర్కిల్‌లో ఆగస్టు నెలలో నిర్వహించే భారీ రాష్ట్ర మహాసభ ఏర్పాట్లపై చర్చించేందుకు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు ఎంతో కొంత సమాజానికి తిరిగివ్వాలని పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ పేరుతో రిజర్వేషన్లు కల్పించడంపై నిలదీసి అడగాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రాజ్యాధికారం రావాలన్నదే ఏకైక లక్ష్యమని పేర్కొన్నారు. ఆ దిశగా పోరాటానికి సన్నద్ధం కావాలన్నారు. తమిళనాడు తరహాలో ఇక్కడా బ్లాక్ షర్ట్ ఉద్యమం మొదలవ్వాలని పేర్కొన్నారు. జనాభాలో అత్యధిక వాటా ఉన్నా బీసీలకు రాజ్యాధికారం తదితర విషయాల్లో న్యాయం జరగడం లేదన్నారు. వారికి రిజర్వేషన్లు కూడా అదే దామాషాలో ఉండాలన్నా రు. ఈ అంశాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదో షె డ్యూలులో పెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషాలో రిజర్వేషన్లు ఉన్నా, అధికారం నామమాత్రంగానే ఉంటోందని చెప్పారు. నిజమైన అధికారం ఎప్పుడూ కొన్ని వర్గాల చేతు ల్లోనే ఉంటోందని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కారం కావాలంటే రాజ్యాధికారం రావాలన్నారు. అందుకోసం పార్టీలకు అతీతంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలంతా ఏకం కావాలని కోరారు.

మాదకద్రవ్యాలతో యువత నిర్వీర్యం



రక్తదాన శిబిరంలో ఆకే రవికృష్ణ, రామచంద్రరాజు, మోహన్

గుంటూరు ఎడ్యుకేషన్: మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్న యువత, విద్యార్థులు నిర్వీర్యమైపోతున్నారని ఏపీ పోలీస్ ఈగల్ విభాగాధిపతి ఐజీ ఆకే రవికృష్ణ పేర్కొన్నారు. డ్రగ్స్ నివారణపై ఆదివారం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ మాదక ద్రవ్యా లు, మత్తు పదార్థాల వలన నేరాలు అధికంగా ఉన్నాయని, అరికట్టేందుకు ప్రభుత్వం తమ విభాగాన్ని ఏర్పాటు చేసిందన్నారు. డ్రగ్స్ రహితంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యం అన్నారు. ఉన్నత విద్యావంతులు కూడా మత్తుకు బానిసలు కావడం దురదృష్టకరమని తెలిపారు. కళాశాలల్లో అవగాహన సదస్సుల ద్వారా దుష్పరిణామాలను వివరిస్తున్నామని పేర్కొన్నారు. డ్రగ్స్ వినియోగించినా, రవాణా చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చ రించారు. రెడ్ క్రాస్ రాష్ట్ర కోశాధికారి పి.రామచంద్ర రాజు మాట్లాడుతూ యువతలో బాధ్యత పెంచేలా ఈగల్ వింగ్ తో కలిసి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలను పురుషుల కంటే మహిళలు అధికంగా వాడటం దురదృష్టకరమని, తల్లిదండ్రులు వారిపై దృష్టి పెట్టాలని తెలిపారు. మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆకే రవికృష్ణ ప్రారంభించారు. ఈగల్ పోలీస్ వింగ్ ఎస్పీ నగేష్ బాబు, డీఎస్పీ అరవింద్, తెనాలి రెడ్ క్రాస్ చైర్మన్ భానుమతి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల అరాచకపర్వం



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభ ముందు టీడీపీ కార్యకర్తలు పార్టీ జెండాలతో ఆపుతున్న దృశ్యం

మేడికొండూరు: తొలి ఏకాదశి పర్వదినాన పేరేచర్ల సింగరయ్య స్వామి తిరునాళ్ల అత్యంత వైభవంగా జరుగుతాయి. మండలంలోని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు ప్రభలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ క్రమంలో పేరేచర్ల గ్రామంలో వరదరాజస్వామి దేవస్థానం సమీపంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రభ ఊరేగింపుగా వెళుతుండగా.. అదే గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఊరేగింపును అడ్డగించారు. టీడీపీ జెండాలతో, పాటలతో ప్రభను అడ్డగించి గొడవకు దిగారు. గ్రామ పెద్దలు జోక్యం చేసుకొని సర్ది చెప్పినా మద్యం మత్తులో తెలుగు తమ్ముళ్లు వీరంగం సృష్టించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తెలుగు తమ్ముళ్ల అరాచకాలు అంతా ఇంతా కాదని ప్రజలు మండిపడుతున్నారు.

దొంగల బీభత్సం



చోరీ జరిగిన రాధాకృష్ణ హార్డ్‌వేర్ అండ్ ఎలక్ట్రికల్స్ షాపులో వేలిముద్రలు సేకరిస్తున్న నిపుణులు



దొంగలు పగలగొట్టిన షాపు వెనుకవైపు తలుపు

- పలుచోట్ల సీసీ కెమెరాలు ధ్వంసం
- రూ.3 లక్షల సామగ్రి దొంగతనం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉండవల్లి అమరావతి రోడ్డులో సాయిబాబా గుడి వద్ద శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు చోరులు బీభత్సం సృష్టించారు. ఉండవల్లి రోడ్డులో తిరుగుతూ పలుచోట్ల సీసీ కెమెరాల వైర్లు ధ్వంసం చేశారు. ఎలక్ట్రికల్ షాపులో చోరీ చేశారు. సేకరించిన వివరాల ప్రకారం.. రాధాకృష్ణ హార్డ్‌వేర్ అండ్ ఎలక్ట్రికల్స్ షాపు యజమాని శనివారం రాత్రి 10 గంటల సమయంలో షాపు మూసి ఇంటికి వెళ్లారు. అనంతరం 12.10 నిమిషాలకు ముగ్గురు వ్యక్తులు మాస్కులు ధరించి హార్డ్‌వేర్ షాపు చుట్టుపక్కల సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి, కెమెరాలను ధ్వంసం చేశారు. 1.45 గంటలకు షాపు రేకులపై నుంచి వెనుకవైపు ఉన్న చిన్న సందులోకి దిగారు. పలుగుతో వెనుక తలుపు పగలగొట్టి లోపలకు దూరారు. అక్కడి నుంచి 2.45 గంటల వరకు షాపులో ఉండి పలు వస్తువులను మూటలు కట్టుకుని గోడ అవతల విసిరివేశారు. తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పరిసర ప్రాంతాల్లో వున్న సీసీ కెమెరాల్లో రికార్డ్ అయింది. మాస్కులు ధరించి ఉండడంతో వారిని గుర్తించడం కష్టంగా మారింది. షాపు యజమాని తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో గుంటూరు నుంచి వేలిముద్రల నిపుణులు వచ్చి పరిశీలించారు. షాపులో సుమారు రూ.3 లక్షల విలువైన సరుకు, రూ.50 వేల నగదు చోరీ అయినట్లు యజమాని తెలిపారు.

కొనసాగిన నాటికల పోటీలు



'ఐ యేట్ ఇండియా' నాటికలో ఓ సన్నివేశం



'అ సత్యం' నాటికలో ఓ దృశ్యం

తెనాలి: రోటరీ కళాపరిషత్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ – తెనాలి వారి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ద్వితీయ ఆహ్వాన నాటికల పోటీలు రెండవ రోజైన ఆదివారం కొనసాగాయి. ప్రదర్శనలకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ జ్యోతిప్రజ్వలన చేశారు. సినీ మాటల రచయిత, కళల కాణాచి, తెనాలి అధ్యక్షుడు డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, పోస్టల్ ఎంప్లాయిస్ కళాపరిషత్ అధ్యక్షుడు డీఎల్ కాంతారావు, ఈదర వెంకట పూర్ణచంద్, ఈదర శ్రీనివాసరావు, గుమ్మడి వెంకట నారాయణ పాల్గొన్నారు. తొలిగా చైతన్య కళాస్రవంతి–ఉక్కునగరం, విశాఖ వారి 'అ సత్యం' నాటికను ప్రదర్శించారు. సుధ మోదుగు మూలకథకు పిన్నమనేని మృత్యుంజయరావు నాటకీకరించగా పి.బాలాజీనాయక్ దర్శకత్వంలో ప్రదర్శించారు. తదుపరి న్యూస్టార్ మోడ్రన్ థియేటర్ ఆర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, విజయవాడ వారి 'ఐ యేట్ ఇండియా' నాటికను ప్రదర్శించారు. రచన, దర్శకత్వం ఎం.ఎస్.చౌదరి. చివరిగా యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్, విజయవాడ వారి 'అనుకున్నదొకటి అయినదొక్కటి' హాస్యనాటికను ప్రదర్శించారు. గోపి వల్లభ రచనకు ఆర్.వాసుదేవరావు దర్శకత్వం వహించారు.